పాఠశాలల పునఃప్రారంభం

- పలు స్కూళ్లల్లో విద్యార్థులకు పూలతో స్వాగతం
- పూలు, బెలూన్లతో పాఠశాలల అలంకరణ

హసన్‌పర్తి : విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

నమస్తే నెట్‌వర్క్, జూన్ 12 : వేసవి సెలవుల్లో ఆట పాటలతో సేద తీరిన విద్యార్థులు పాఠశాలలకు పరుగులు పెట్టారు. గురువారం నుంచి నూతన విద్యా సంవత్సరం ప్రారంభమవుతుండడంతో బడుల తలుపులు తెరుచుకున్నాయి. అధికారులు పాఠశాలలను అందుకనుగుణంగా తీర్చిదిద్దారు. మామిడి తోరణాలు, పూలు, బెలూన్లతో అలంకరించారు. హనుమకొండ లష్కర్‌బజార్‌లోని మర్కజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ప్రాక్టీసింగ్ హైస్కూల్‌లో ప్రారంభోత్సవం సందర్భంగా విద్యార్థులు తోరణాలు కట్టారు. నడికూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పులిగిల్ల ప్రాథమిక ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు యూనిఫామ్స్, టెక్స్ట్ బుక్స్ పంపిణీ చేశారు. ఆర్డీవో నారాయణ పాల్గొన్నారు. శాయంపేట మండలంలోని పెద్దకోడెపాక, నేరేడుపల్లి జడ్పీ హైస్కూళ్లలో మామిడి తోరణాలు, పూలు కట్టి ముస్తాబు చేశారు. స్కూళ్ల ముందు ముగ్గులు వేసి తీర్చిదిద్దారు. విద్యార్థులకు హెచ్ఎం అల్లం మాధవి, ఉపాధ్యాయులు గులాబీ పూలు ఇచ్చి గ్రాండ్ వెల్‌కం చెప్పారు. ఆత్మకూరులో 'అమ్మ మాట అంగన్‌వాడీ బాట' నినాదంతో ర్యాలీ చేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమా మాట్లాడుతూ.. ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా గర్భిణులకు, ప్రీ స్కూల్ పిల్లలకు ఇక నుంచి వారానికి రెండు రోజులు ఎగ్ బిర్యానీ అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అంగన్‌వాడీ టీచర్లు తన్గుల కరుణ, పెరుమాండ్ల దేవమ్మ, శ్రీదివ్య పాల్గొన్నారు. శాయంపేట మండలంలోని మైలారం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచి పూర్వ ప్రాథమిక విద్యను అమలు చేయాలని జిల్లా సంక్షేమ అధికారి జయంతి, మండల విద్యా శాఖ అధికారి గడ్డం భిక్షపతి అన్నారు. పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు.

ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు విక్రయిస్తే చర్యలు

మడికొండ : ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్ విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఎంఈవో బండారి మనోజ్ కుమార్ హెచ్చరించారు. మడికొండలోని ఏకశిలా హైస్కూల్లో అనధికారికంగా పుస్తకాలు విక్రయిస్తున్నారన్న సమాచారం తెలుసుకుని ఆయన పుస్తకాలు ఉన్న గదిని సీజ్ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య – వరంగల్ ఎంపీ కడియం కావ్య

హనుమకొండ చౌరస్తా : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యా బోధన ఉంటుందని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. గురువారం న్యూశాయంపేటలోని పోచంపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పునఃప్రారంభ కార్యక్రమాన్ని ఎంపీ కలెక్టర్ ప్రావీణ్య, డీఈవో వాసంతితో కలిసి ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి నీళ్లు పోశారు. జిల్లాలో 135 పాఠశాలల్లో విద్యార్థులకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా కంప్యూటర్ బోధన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎంఈవో మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యం – ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

హసన్‌పర్తి : విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. మండలంలోని జయగిరి ప్రాథమికోన్నత పాఠశాలలో ఎమ్మెల్యే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు అందజేశారు. తల్లిదండ్రులు అప్పులు తెచ్చి ప్రైవేట్ పాఠశాలకు పంచి అప్పుల పాలు కావొద్దన్నారు. అలాగే నియోజక వర్గానికి రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూలు మంజూరైందన్నారు. ఎంఈవో రాజిరెడ్డి పాల్గొన్నారు.

బడుల అభివృద్ధిలో తల్లిదండ్రులు భాగస్వాములు కావాలి : డీఈవో

హనుమకొండ చౌరస్తా/హనుమకొండ సబర్బన్ : తల్లిదండ్రుల భాగస్వామ్యం సంపూర్ణంగా ఉన్నప్పుడే పాఠశాలలు సమగ్ర అభివృద్ధిని సాధిస్తాయని డీఈవో వాసంతి అన్నారు. హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశానికి హాజరైన ఆమె మాట్లాడుతూ.. పాఠశాలల్లో క్వాలిటీ పెంచడం తమ బాధ్యత అని, పాఠశాలల అస్తిత్వాన్ని కాపాడే బాధ్యత తల్లిదండ్రులు తీసుకోవాలని కోరారు. ప్రతి నెల మూడో శనివారం తల్లిదండ్రుల సమావేశానికి క్రమం తప్పకుండా హాజరు కావాలన్నారు. సెక్టోరియల్ అధికారి సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించే విధంగా వారికి అవగాహన కల్పించాలని జిల్లా కార్య నిర్వహణాధికారి విద్యాలత అన్నారు. కమలాపూర్ మండలంలోని భీంపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు.

హనుమకొండ చౌరస్తా : మర్కజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నోట్‌బుక్స్, యూనిఫామ్స్ అందజేస్తున్న డీఈవో వాసంతి

ఆత్మకూరు : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

అహ్మదాబాద్ విమాన దుర్ఘటన బాధాకరం

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ చౌరస్తా, జూన్ 12 : అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి బయలుదేరిన ఎయిర్ ఇండియా విమానం కూలిపోవడం దురదృష్టకరమని, పలువురు ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. ఈ దుర్ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

పోలీసుల కస్టడీ నుంచి తప్పించుకున్న నిందితుడు

కాజీపేట, జూన్ 12 : ఎస్కార్ట్ పోలీసుల కళ్లు కప్పి ఓ నిందితుడు తప్పించుకున్న ఘటన గురువారం వెలుగు చూసింది. ద్విచక్ర వాహనం దొంగిలించిన నిందితుడు బుధవారం సాయంత్రం ఎంజీఎం దవాఖానలో ఎస్కార్ట్ పోలీసులను నమ్మించి ఉడాయించాడు. కడిపికొండకు చెందిన కస్తూరి సాయికుమార్ (27) పట్టణంలో ఇటీవల బైక్‌ను దొంగిలించి పోలీసులకు పట్టుబడ్డాడు. పోలీసులు నిందితుడిని కోర్టులో హాజరు పరిచేందుకు వైద్య పరీక్షల కోసం ఎంజీఎం దవాఖానకు తీసుకెళ్లారు. ఎస్కార్టు పోలీసులు దవాఖానలో పేపర్ వర్క్ చేస్తుండగా నిందితుడు పారిపోయాడు. పోలీసులు అప్రమత్తమై వెంట పడగా, నిందితుడు వరంగల్ రైల్వే స్టేషన్ వైపు పరుగులు తీసి విజయవాడ వెళ్తున్న రైలు ఎక్కి ఉడాయించాడు. ఎస్కార్టు పోలీసులు మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో అదే రోజు రాత్రి ఫిర్యాదు చేశారు. నిందితుడిని పట్టుకునేందుకు కాజీపేట సీఐ సుధాకర్‌రెడ్డి రెండు ప్రత్యేక పోలీస్ బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిసింది.

దళితుల భూమికి రక్షణ కల్పించాలి

ఆత్మకూరు, జూన్ 12 : దళితుల భూములకు రక్షణ కల్పించాలని, భూ కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ) జిల్లా సభ్యుడు, దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ డిమాండ్ చేశారు. గురువారం దళిత సంఘాల ఆధ్వర్యంలో మండలంలోని హౌస్ బుజుర్గులో కబ్జాకు గురైన దళితుల భూములను పరిశీలించి నిజ నిర్ధారణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 1999లో సర్వే నంబర్ 140లో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిరుపేద దళిత కుటుంబాలకు 18 ఎకరాలు పంపిణీ చేశారని ఈ భూమి నేషనల్ హైవేకు అనుకొని ఉండడంతో కొందరు వ్యక్తులు కబ్జాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజా సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ మాదాసి సురేశ్, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు నద్దునూరి రఘు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంలో ఆరు బర్రెల మృతి

హసన్‌పర్తి, జూన్ 12 : విద్యుదాఘాతంతో ఆరు బర్రెలు మృతి చెందాయి. మండలంలోని మల్లారెడ్డి పల్లె శివారులోని సబ్‌స్టేషన్ సమీపంలో గురువారం బర్రెలు మేత మేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తెగి వాటిపై పడడంతో అక్కడికక్కడే మృతిచెందాయి. ఇదే గ్రామానికి చెందిన బూరుగు రమేశ్ 2 బర్రెలు, బూరుగు నవీన్ 2 బర్రెలు, బూరుగు తిరుపతక్క ఒక బర్రె, కుంభం భగవాన్‌రెడ్డికి చెంది ఒక బర్రె మృతి చెందింది. ఒక్కో బర్రె విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని, బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు సాంబయ్య కోరారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు ప్రారంభం

భూమి పూజలో పాల్గొన్న పీఏసీఎస్ మాజీ చైర్మన్ రవీందర్‌గౌడ్

ఆత్మకూరు, జూన్ 12 : పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఏరుకొండ రవీందర్‌గౌడ్ గురువారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించారు. మండల కేంద్రానికి 75 ఇళ్లు మంజూరయ్యాయన్నారు. మిగతా లబ్ధిదారులకు త్వరలోనే అందజేస్తామన్నారు.

డాక్టర్ కూరపాటి రమేశ్, రాధికకు సత్కారం

డాక్టర్ కూరపాటి రమేశ్, రాధికను సన్మానిస్తున్న దృశ్యం

హనుమకొండ చౌరస్తా, జూన్ 12 : ఈ నెల 9 నుంచి 15వ తేదీ వరకు జరుగుతున్న నేషనల్ సర్జన్స్ డే వారోత్సవాల సందర్భంగా హనుమకొండలోని ప్రముఖ జనరల్ సర్జన్ డాక్టర్ కూరపాటి రమేశ్, స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ కూరపాటి రాధిక, డాక్టర్ శారద, ఎంజీఎం ప్రొఫెసర్ డాక్టర్ సుధాకర్‌ను బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఉమ్మడి వరంగల్ జిల్లా జాక్ కన్వీనర్ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జాక్ ఉమ్మడి జిల్లా సలహాదారు దామెర ఉపేందర్, జాక్ కో ఆర్డినేటర్లు సుమన్, సాయిబాబు యాదవ్, ఎన్‌హెచ్ఆరెస్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కూరాకుల భారతి, అశోక్‌బాబు, సునీల్, వరంగల్ జాక్ కన్వీనర్ ఇంటలెక్చువల్ ఫోరం కో ఆర్డినేటర్ డాక్టర్ కుసుమ సూర్యకిరణ్, బహుజన గాయకుడు సారంగపాణి, సురేశ్, రవి, హాస్పటల్ సిబ్బంది ఘనంగా సన్మానించినట్లు కార్యనిర్వాహకులు డాక్టర్ చందా మల్లయ్య తెలిపారు.

'సుజనహిత' చిట్‌ఫండ్స్ వార్షికోత్సం

వేడుకలు జరుపుకుంటున్న చైర్మన్ శేఖర్‌గౌడ్

హనుమకొండ చౌరస్తా, జూన్ 12 : హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలోని సుజనహిత చిట్‌ఫండ్స్ 6వ వార్షికోత్సవం సందర్భంగా సంస్థ చైర్మన్ బండారి శేఖర్ గౌడ్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 6 సంవత్సరాల నుంచి ఖాతాదారుల పొదుపులో విశ్వసనీయ భాగస్వామిగా ఉంటూ వారి ఆర్థిక అవసరాలను తీరుస్తూ నమ్మకంగా పని చేస్తున్నదని చెప్పారు. రాబోయే కాలంలో కూడా ఖాతాదారులకు నమ్మకంగా ఉంటూ వారి ఆర్థిక లక్ష్యాలను సాధించడంలో తోడ్పాటునందిస్తుందన్నారు. కార్యక్రమంలో సంస్థ ఎండీ గుడిపాటి జనార్ధన్, ఉద్యోగులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్ రంజిత్

సుబేదారి, జూన్ 12 : సుబేదారి ఇన్‌స్పెక్టర్‌గా రంజిత్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఎస్సైలు, సిబ్బంది కొత్త ఆయనను కలిశారు. అలాగే బదిలీ అయిన ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డిని సన్మానించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ధర్మసాగర్, జూన్ 12 : సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో అప్పయ్య సూచించారు. ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశానుసారం ప్రతి గురువారం నిర్వహిస్తున్న బాలింతల సంరక్షణ కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాటికాయల, పెద్దపెండ్యాల, ముప్పారంలోని ఆరోగ్య ఉప కేంద్రాలను తనిఖీ చేశారు. ప్రజలను ఆశ కార్యకర్తల పని తీరుపై ఆయన అడిగి తెలుసుకున్నారు.

కాజీపేటలో ఇంటర్ రైల్వే సేఫ్టీ అధికారుల తనిఖీలు

రైల్వే యార్డులో తనిఖీలు చేస్తున్న రైల్వే అధికారులు

కాజీపేట, జూన్ 12 : రైల్వే ఇంటర్ సేఫ్టీ అధికారులు గురువారం కాజీపేట జంక్షన్‌లో తనిఖీలు నిర్వహించారు. సౌత్ వెస్ట్రన్ రైల్వే సీఆర్ఎస్ఈ వీఎం దాస్ పుత్ర నేతృత్వంలో రైల్వే అధికారులు వేర్వేరు బృందాలుగా విడిపోయి క్రూ ల్యాబీ, ఆర్ఆర్ఐ క్యాబిన్, రన్నింగ్ రూం, రైల్వే స్టేషన్, బుకింగ్, పార్సిల్ కార్యాలయం, గూడ్స్ యార్డు, ఎంఆర్‌వీ, టీఆర్‌డీ, సీఅండ్‌డబ్ల్యూ, ఎస్అండ్‌టీ, ఎల్‌సీ గేట్లు, రైల్వే బ్రిడ్జిలు, రైల్వే పట్టాల ఇంజినీరింగ్ తదితర కార్యాలయాలను పరిశీలించారు. సీనియర్ డీసీఎం రవీంద్రనాథ్, డీవోఎం సుధీర్ కుమార్, సీనియర్ డీఎస్‌టీ అగర్వాల్, సీనియర్ డీఎస్‌వో సురేశ్, డీఈఎన్ సెంట్రల్ ప్రంజ్వల్ కేసర్‌వాణి, సీనియర్ డీఎంఈ వెంకట్ కుమార్, సీనియర్ డీఈఈ ప్రశాంత్ కృష్ణసాయి పాల్గొన్నారు.

బీసీలను మోసం చేస్తున్న కాంగ్రెస్

హనుమకొండ చౌరస్తా, జూన్ 12 : సామాజిక న్యాయం చాటున కాంగ్రెస్ పార్టీ బీసీలను మోసం చేస్తుందని బీసీ జాక్ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరునహరి శేషు మండిపడ్డారు. సుబేదారిలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 56 శాతం ఉన్న బీసీలకు మంత్రివర్గంలో మూడు మంత్రి పదవులు మాత్రమే (20 శాతం) కేటాయించడం సమంజసం కాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీలకు నాలుగు మంత్రి పదవులు కేటాయించిందని గుర్తు చేశారు. తప్పులతడక లాంటి కులగణన, బీసీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకుండా మోసం చేయడం, పూలే విదేశీ విద్యాజ్యోతి పథకంలో లబ్ధిదారుల సంఖ్యను పెంచకపోవడం, సంచార జాతుల కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోవడం సామాజిక న్యాయమా? సామాజిక మోసమా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రతి విషయంలో బీసీలను మభ్యపెడుతున్నదని విమర్శించారు. బీసీ నాయకులు ధారబోయిన సతీశ్, ఎర్రబోజు రమేశ్ ఉన్నారు.

తల్లిని చంపిన కొడుకు.. ఆస్తి తగాదాలే కారణం

సరోజన(ఫైల్)

నయీంనగర్, జూన్ 12 : పెంచిన తల్లిని కొడుకే కాలయముడై చంపిన ఘటన కేయూ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పెగడపల్లి గ్రామానికి చెందిన చల్ల శ్రీనివాస్ తన భార్య చాలా సంవత్సరాల క్రితం మరణించడంతో సరోజన అనే మహిళను మళ్లీ పెళ్లి చేసుకున్నాడు. సరోజనకు ఇద్దరు కూతుళ్లు ఉండగా, తన తండ్రికి చెందిన ఆస్తిని వారికే పంచి ఇస్తున్నాడని శ్రీనివాస్ మొదటి భార్య కొడుకు భూపాల్‌రెడ్డి గురువారం రాత్రి గొడ్డలితో సరోజనను ఇంట్లో నరికి చంపినట్లు తెలిసింది. భూపాల్‌రెడ్డిని కేయూ పోలీసులు అదుపులో తీసుకున్నట్లు సమాచారం.

ట్రాఫిక్ సిబ్బందిని దూషించిన ముగ్గురిపై కేసు

సుబేదారి, జూన్ 12 : విధుల్లో ఉన్న హనుమకొండ ట్రాఫిక్ సిబ్బందిని దుర్భాషలాడిన ముగ్గురు యువకులపై కేసు నమోదు చేసినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కేయూ జంక్షన్ వద్ద బుధవారం డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్న హనుమకొండ ట్రాఫిక్ పోలీసులను మద్యం తాగిన సాయికుమార్, రవీందర్, ఆరిఫ్ దుర్భాషలాడి విధులకు అటకం కలిగించారు. ట్రాఫిక్ కానిస్టేబుల్ కిరణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు వారిపై కేయూసీ పోలీసులు కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రెవెన్యూ సదస్సులతో సమస్యలు పరిష్కారం

ఎల్కతుర్తి, జూన్ 12 : రెవెన్యూ సదస్సుల ద్వారా రైతుల భూ సమస్యలకు పరిష్కారం చూపుతామని రెవెన్యూ అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని బావుపేటలో జరుగుతున్న రెవెన్యూ సదస్సును గురువారం పరిశీలించారు. దరఖాస్తుల స్వీకరణతో పాటు బాధితులకు రసీదులు అందిస్తున్నారా? లేదా? అని సిబ్బందిని ఆరా తీశారు. ఏ ఏ సమస్యలపై ఎక్కువగా దరఖాస్తులు వస్తున్నాయో తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జగత్‌సింగ్, డిప్యూటీ తహసీల్దార్ భద్రునాయక్, ఆర్ఐలు భరత్, సదానందం పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

పాత ఫర్నీచర్ కావలెను
★స్కూల్‌కు సంబంధించిన పాత ఫర్నీచర్ కావలెను. వెంటనే సంప్రః శ్రీ భువనేశ్వరీ అప్పర్ ప్రైమరీ స్కూల్, సెల్: 8465877022.
NTW-337020

WANTED
★ఎలాంటి విద్యార్హత లేకున్నా ఫర్వాలేదు. మంచి వాక్చాతుర్యం కలిగినవారు మా సంస్థలో మార్కెటింగ్ చేయుటకు అనుభవం ఉన్నవారికి ఇదే మా ఆహ్వానం. 7981217883.
NT-325336

WANTED HOSPITAL STAFF
jobs Apply Now!
★PHARMACY BOYS (Experienced)
★LAB TECHNICIANS (Experienced)
★COMPUTER OPERATORS & SUPERVISORS
Guardian Hospital, Mulugu 'X' Road, WGL. 12 to 2 PM.
NTW-522

LOSS OF PASSPORT
★I, MOHAMMED MANZOOR SHAREEF S/o. MOHAMMED HUSSAIN SHAREEF R/o H.No. 2-6-1109, Near Masjide Shariefain, KLN Reddy Colony, Subedari, Hanamkonda Town & Dist-506001. I Lost my Original Passport bearing No. H0384920 issued at Hyderabad. While travelling by bike to Xerox Center, Subedari. If anybody found Please inform to me cell: 9849202825.
NTW-6706

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లను త్వరగా రిలీజ్ చేయాలి

హనుమకొండ చౌరస్తా, జూన్ 12 : 16 సర్కిళ్ల పరిధిలో వ్యవసాయ సర్వీస్ కనెక్షన్లను యుద్ధప్రాతిపదికన రిలీజ్ చేయాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎన్పీడీసీఎల్ విద్యుత్ భవన్‌లో డైరెక్టర్లు, సీఈలతో 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు, ఏడీఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇప్పటివరకు ఇంటర్ లింకింగ్ లైన్లు 68 పూర్తయ్యాయని, ఈ నెలాఖరు వరకు మిగిలిన 97 పనులు పూర్తి చేస్తామని ఎస్ఈలు తెలిపారు. బంధ్ ఫీడర్లు ఉన్నచోట వీసీబీలు (వ్యాక్యూమ్ సర్క్యూట్ బ్రేకర్) 208 పూర్తి చేశామని తెలిపారు. ప్రతి సబ్‌స్టేషన్‌కు ప్రత్యామ్నాయ విద్యుత్ సరఫరా ఉండేటట్లు చూడాలని కోరారు. పురోగతిలో ఉన్న కొత్త సబ్‌స్టేషన్ల పనులు వేగవంతం చేయాలని చెప్పారు. టాన్‌లలో అవసరమున్న చోట 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ప్రతిపాదనలను ఇవ్వాలని చెప్పారు. బ్రేక్‌డౌన్స్, ట్రిప్పింగ్స్ టాన్లలో లేకుండా ఫీడర్‌ల నిర్వహణ ప్రతి నెలా నిర్వహించాలన్నారు. అన్ని 33కేవీ అండ్ 11కేవీ స్తంభాలకు యూనిక్‌పోల్ నంబర్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. విద్యుత్ వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి అవసరమైన అన్ని సత్వర చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు సదర్‌లాల్, మధుసూదన్, సీఈలు రాజుహన్, జీఎంలు ఉత్తమ్, సురేందర్, డీఈ అనిల్‌కుమార్, ప్రభావతి పాల్గొన్నారు.

స్వనిధి సే సమృద్ధి కార్యక్రమంలో పాల్గొన్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వీధి వ్యాపారుల కోసమే 'స్వనిధి సే సమృద్ధి'

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, జూన్ 12 : వీధి వ్యాపారుల సౌలభ్యం కోసమే 'స్వనిధి సే సమృద్ధి' కార్యక్రమం నిర్వహిస్తున్నామని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. గురువారం కాజీపేట సీఆర్‌సీ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. వంద రోజుల ప్రణాళికలో భాగంలో 9 నుంచి 14వ తేదీ వరకు స్వనిధి సే సమృద్ధి కార్యక్రమం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయ రజాలీ, డిప్యూటీ కమిషనర్ రాజేశ్వర్, డీఎంసీ రజితారాణి, ఏడీఎంసీ వెంకట్‌రెడ్డి, సీవోలు రమేశ్, శ్రీనివాసులు, శ్రీలత పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

దామెర, జూన్ 12 : మండలంలోని ముస్త్యాలపల్లి గ్రామానికి చెందిన మార్త కుమారస్వామి(50) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడని ఎస్సై కొంక అశోక్ తెలిపారు. కుమారస్వామి ఈ నెల 7వ తేదీన ఇంటి నుంచి పని కోసం వెళ్తుండగా గ్రామ క్రాస్‌రోడ్డు వద్ద ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోయాడు. తలకు తీవ్రగాయం కావడంతో చికిత్స కోసం వరంగల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడి కుమారుడు శ్రావణ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎంఈవో కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ధర్నా

హనుమకొండ చౌరస్తా, జూన్ 12 : నగరంలో ప్రైవేటు పాఠశాలలకు ఎంఈవో కొమ్ముకాస్తున్నాడని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ అన్నారు. గురువారం హనుమకొండలోని ఎంఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. నగరంలో ప్రైవేటు కార్పొరేటు పాఠశాలలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, ఎంఈవో, జిల్లా విద్యాశాఖాధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించాలని కోరారు. సాయికుమార్, అభిషేక్, ప్రదీప్ ఉన్నారు.

జీపీ కార్యదర్శిని దూషించిన వ్యక్తిపై ఫిర్యాదు

శాయంపేట, జూన్ 12 : చెరువు నుంచి కొందరు మొరం తరలించుకుపోతుంటే ఏం చేస్తున్నావంటూ పంచాయతీ కార్యదర్శిని ఓ వ్యక్తి దూషించాడు. దీనిపై కార్యదర్శి గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని తహరాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి కొంగొండి అజయ్‌కు ఈ నెల 11న అదే గ్రామానికి చెందిన పిట్ట సుమన్ ఫోన్ చేశాడు. కుమ్మరికుంట నుంచి మొరం తరలిస్తుంటే ఏం చేస్తున్నావంటూ దుర్భాషలాడాడు. మొరం విషయంపై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయాలని చెప్పినా వినలేదు. దీంతో తన విధులను ఆటంకపర్చిన సుమన్‌పై చర్యలు తీసుకోవాలని బాధిత కార్యదర్శితో పాటు మండలంలోని కార్యదర్శులు సీఐ రంజిత్‌రావును కలిసి ఫిర్యాదు చేశారు.

పేకాడుతున్న నలుగురి అరెస్ట్

ఆత్మకూరు, జూన్ 12 : హౌసుబుజుర్గు గ్రామానికి చెందిన పేకాడుతున్న నలుగురిని గురువారం రాత్రి అరెస్ట్ చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. షేక్ అక్బర్ ఇంటి వద్ద పేకాడుతున్నారనే సమాచారం మేరకు సోదా చేసి షేక్ హుస్సేన్, సయ్యద్ వలీ, షేక్ అక్బర్, షేక్ సైదాలీని పట్టుకున్నట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.800 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

డంపింగ్ యార్డును ఎత్తివేయాలి

కాజీపేట, జూన్ 12 : మడికొండ, రాంపూర్ గ్రామాల శివారులోని డంపింగ్ యార్డును ఎత్తివేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేశ్ ప్రభుత్వాన్ని కోరారు. కాజీపేట